క్లుప్తంగా

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోండి

రాయికోడ్(అందోల్): యాసంగి సీజన్‌కు సంబంధించి నూతనంగా పట్టా పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతుబంధు పెట్టుబడి సాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అభినాష్‌వర్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవంబర్ 17వ తేదీ వరకు కొత్తగా భూపట్టా పాసు బుక్కులు పొందిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు తమ ఆధార్, భూపట్టా పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లతో ఏఈఓల వద్ద లేదా రైతువేదికల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

హామీలను అమలు చేయాలి

నారాయణఖేడ్: కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను ఏడాదిలోపైనా అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు చిలకమర్రి నర్సింహా అన్నారు. నారాయణఖేడ్‌కు గురువారం వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. అయినప్పటికీ ప్రజలు బీఆర్ఎస్‌ను ఓడించారని తెలిపారు. ఇందుకు కారణం ఆయా నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు అవలంభించిన ప్రజావ్యతిరేక విధానాలేనని చెప్పారు.

కొనసాగుతున్న సమ్మె



పోస్టాఫీస్ ఎదుట సమ్మె నిర్వహిస్తున్న ఉద్యోగులు

జహీరాబాద్: తమ న్యాయమైన డిమాండ్ల సాధనం కోసం తపాల ఉద్యోగులు చేపట్టిన సమ్మె గురువారంతో మూడో రోజుకు చేరుకుంది. జహీరాబాద్ పట్టణంలోని సబ్ డివిజన్ పోస్టాఫీసు వద్ద ఉద్యోగులు టెంట్ వేసుకుని సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడే వంటావార్పు నిర్వహించి భోజనాలు చేశారు. డిమాండ్లను సాధించుకునేవరకు సమ్మె కొనసాగిస్తామని ఆయా యూనియన్ల నాయకులు తెలిపారు.

కాలనీల అభివృద్ధికి కృషి



వాసవీనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని కాలనీల అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్ప అన్నారు. బస్తీ దర్శన్ కార్యక్రమంలో భాగంగా గురువారం వాసవినగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని వివిధ సమస్యలను కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు.

ఐమాస్ట్ లైట్ ఏర్పాటు

మునిపల్లి(అందోల్): మండలంలోని మేళసంగ్యం చౌరస్తాలో స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్(ఎస్‌సీపీ) ద్వారా మంజూరైన రూ.1,67000లతో ఐమాస్ట్ లైట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మైనార్టీ జిల్లా నాయకులు కుత్బొద్దీన్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ సహకారంతో ఐమాస్ట్ లైట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐమాక్స్ లైట్ ఏర్పాటుకు కృషి చేసిన ఎంపీపీ శైలజ, జెడ్పీటీసీ మీనాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

రేపు కార్మిక సంఘం ఎన్నికలు

జహీరాబాద్: ఈ నెల 16వ తేదీన జహీరాబాద్ సమీపంలోని మహీంద్రా ట్రాక్టర్ ప్లాంట్ యూనిట్‌లో కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రధాన యూనియన్లు పోటీపడుతున్నాయి. కర్మాగారంలో 410 మంది కార్మికులు ఉన్నారు. ఎన్నికల్లో సీఐటీయూ తరఫున చుక్క రాములు, బీఎంఎస్ తరఫున మల్లేశం, బీఆర్‌టీయూ తరఫున రాంబాబులు పోటీ పడుతున్నారు. 2021 ఫిబ్రవరిలో నిర్వహించిన ఎన్నికల్లో టీఆర్ఎస్ మద్దతుదారు గెలుపొందారు. తాజాగా జరుగుతున్న ఎన్నికల్లో మూడు యూనియన్ల మధ్య ప్రధాన పోటీ నెలకొని ఉంది. దీంతో కార్మికుల మద్దతును కూడగట్టుకుని గెలుపొందేందుకు ఆయా యూనియన్లు ముమ్మరంగా ప్రయత్నాలు సాగిస్తున్నాయి.

నాణ్యమైన విద్య అందించండి

సంగారెడ్డి టౌన్: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని నోడల్ అధికారి వహీద్ పాషా అన్నారు. సంగారెడ్డి మండలంలోని ఇరిగిపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలను మండల నోడల్ అధికారి గురువారం సందర్శించారు. పాఠశాలలో కొనసాగుతున్న తొలిమెట్టు కార్యక్రమం గురించి ఉపాధ్యాయులు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిరణ్‌కుమారి, ఉపాధ్యాయుడు విజయానంద్, సీఆర్పీ దత్తు పాల్గొన్నారు.

● ఆదమరిస్తే అంతే..



ప్రమాదకరంగా వట్‌పల్లి - దుద్యాల రోడ్డు

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని వట్‌పల్లి నుంచి దుద్యాల వరకు వేళ్లే రోడ్డు పనులను అసంపూర్తిగా వదిలేయడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. బీటీ రోడ్డు పనుల్లో భాగంగా 116 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5లక్షలను ప్రభుత్వం కేటాయించింది. ఈ విషయమై పీఆర్ ఏఈ మొగులయ్యను వివరణ కోరగా రోడ్డు పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. కానీ.. బిల్లులు రాలేదని కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపివేసినట్లు తెలిపారు.

● స్తంభించిన బట్వాడా సేవలు



తపాలా కార్యాలయంలో పేరుకుపోయిన పార్సిళ్లు

నారాయణఖేడ్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తపాలా ఉద్యోగులు చేపట్టిన సమ్మెతో తపాలా సేవలు స్తంభించిపోయాయి. ఖేడ్ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని ఉప కార్యాలయాల్లో బట్వాడా నిలిచిపోవడంతో పార్సిళ్లు పేరుకుపోయాయి. కేంద్ర ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని తపాలా ఉద్యోగులు, సిబ్బంది కోరుతున్నారు. సంఘం బాధ్యులు శిరోమణి, నర్సారెడ్డి, హన్మారెడ్డి, నాగయ్య, అశోక్‌బాబు, మానిక్యప్ప, సంగమేశ్వర్, సుప్రియ పాల్గొన్నారు.

● నేటి నుంచి ఉత్సవాలు



ముస్తాబైన మైసమ్మ అమ్మవారి ఆలయం

కోహీర్(జహీరాబాద్): మండల పరిధిలోని సజ్జాపూర్‌లో 3రోజుల పాటు మైసమ్మ, దుర్గమ్మ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపనలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు పట్లోళ్ల పద్మమ్మ తెలిపారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో ఓంకారేశ్వర ఆలయ పీఠాధిపతి సద్గురు దక్షిణామూర్తి దీక్షితులు ఆధ్వర్యంలో హోమం, జలాధివాసం, ధన్యాధివాసం, శయాధివాసం, పుష్పాధివాసం, పూర్ణకుంభం పూజలతో పాటు విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహిస్తామన్నారు. 24న అమ్మవార్లకు బోనాలు సమర్పించనున్నట్లు తెలిపారు.

సమన్వయంతోనే అభివృద్ధి

- వివిధ శాఖల పనితీరుపై చర్చ
- అధికారుల నిర్లక్ష్యంపై మండిపాటు
- ప్రజాసమస్యలను పరిష్కరించాలని సభ్యుల డిమాండ్



మాట్లాడుతున్న ఎంపీపీ యాదమ్మ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధికి కృషిచేయాలని ఎంపీపీ తొంట యాదమ్మ అన్నారు. మండల మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ శాఖల పనితీరును వివరించారు. అనంతరం సర్పంచులు గంగన్న, భూపాల్‌రెడ్డి, ఎంపీటీసీలు మాధవరెడ్డి, అల్లం లలిత, మమత మాట్లాడుతూ.. మండలంలోని గ్రామాల్లో ఆస్తి మార్పిడి జరగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. చనిపోయిన వ్యక్తుల పేర్లపైనే ఇప్పటికీ అధికారులు ఆస్తి పన్నులు వసూలు చేస్తున్నారని సభ దృష్టికి తెచ్చారు. వారసత్వంగా సంక్రమించే ఇళ్ల వారసుల పేరుపై మార్పిడి చేసేందుకు అధికారులు ఆస్తులకు సంబంధించిన రిజిస్టర్ డాక్యుమెంట్స్ అడుగుతున్నారని తెలిపారు. గ్రామాల్లో ఆస్తి పన్ను రశీదులు తప్ప డాక్యుమెంట్స్ ఉండవని, లేని డాక్యుమెంట్స్ ఎక్కడి నుంచి తేవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు..

ఆయా గ్రామాల్లో విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. గ్రామ పంచాయతీలకు నిధులు లేక అభివృద్ధి కుంటుపడుతుందని సభ్యులు పేర్కొన్నారు. దీంతో ప్రజల మౌలిక వసతులను తీర్చలేని ప్రజాప్రతినిధులుగా తమపై ముద్ర పడుతుందని పలువురు సభ్యులు వాపోయారు. తంగడపల్లి గ్రామం వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి, సదాశివపేట నుంచి నిజాంపూర్ గ్రామ బీటీ రోడ్డు, నిజాంపూర్ నుంచి పొట్టిపల్లి గ్రామం వరకు చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు. సమావేశంలో అంగన్‌వాడీ, ఐకేపీ, ఈజీఎస్, రెవెన్యూ, వ్యవసాయ, ఆర్టీసీ, విద్య తదితర శాఖల పనితీరుపై చర్చించారు. సమావేశానికి మద్యపాన నిషేధం, ఇరిగేషన్, కాలుష్య నియంత్రణ మండలి శాఖల అధికారులు గైరాజరయ్యారు. సమావేశంలో ఎంపీడీఓ పూజ,ఎంపీఓ నారాయణ, డిప్యూటీ తహశీల్దార్ వీరేశం,సర్పంచులు,ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రాలపై దాడులు

సాక్షి ఎఫెక్ట్



దాడుల్లో పాల్గొన్న పోలీసులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధితో పాటు ఆయా పారిశ్రామికవాడల్లో అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ దందా కొనసాగుతుండటంతో 'యథేచ్ఛగా గ్యాస్ రీఫిల్లింగ్' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో స్పందించిన బొల్లారం సీఐ నయీముద్దీన్ ఆధ్వర్యంలో గురువారం పోలీసులు బృందాలుగా ఏర్పడి బొల్లారం, గడ్డపోతారం, ఖాజీపల్లి పారిశ్రామికవాడల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. బొల్లారంలో అక్రమంగా కొనసాగుతున్న రీఫిల్లింగ్ కేంద్రాన్ని గుర్తించిన పోలీసులు 20 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.

మోకాళ్లపై నడిచి మొక్కు చెల్లింపు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని బీబీపేటకు చెందిన కాంగ్రెస్ నాయకుడు ఎన్నాం కిష్టారెడ్డి కామారెడ్డి జిల్లా వర్ని మండల పరిధిలోని బడపాహడ్ దర్గా మెట్లపై గురువారం మోకాళ్లపై నడిచి ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కు చెల్లించుకున్నాడు. కాంగ్రెస్ అధికారంలో రావడం, నారాయణఖేడ్ ఎమ్మెల్యేగా సంజీవరెడ్డి విజయం సాధించడంతో మొక్కు చెల్లించుకున్నట్లు కిష్టారెడ్డి తెలిపాడు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



హత్నూర: శబరిమలకు వెళ్తున్న అయ్యప్పస్వాములు



పడిపూజ నిర్వహిస్తున్న అయ్యప్ప దీక్షాపరులు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన కేతకి సంగమేశ్వర ఆలయంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజను గురువారం ఘనంగా నిర్వహించారు. ఝరాసంగం గురుస్వామి సంగన్న స్వామి ఆధ్వర్యంలో గురుస్వామి శ్రీశైలం ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావుపాటిల్, ప్రజాప్రతినిధులు మోహన్‌రెడ్డి, పరమేశ్వర్ పాటిల్, రజినిప్రియ, సంతోష్‌కుమార్ పాటిల్, తదితరులు పాల్గొన్నారు.

కల్హేర్‌లో..

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లిలో మహాపడి పూజ ఘనంగా నిర్వహించారు. ఎల్లారెడ్డికి చెందిన చంద్రం గురుస్వామి ఆధ్వర్యంలో మెట్ల పూజ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి సోదరుడు చంద్రశేఖర్‌రెడ్డి హాజరై పూజల్లో పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ పద్మ బాపురాజు, రైతుబంధు మాజీ అధ్యక్షుడు దుర్గరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ సంగారెడ్డి, నాయకులు కాల్వ అంజిరెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

శబరికి తరలిన అయ్యప్పస్వాములు

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని నస్తీపూర్ రామాలయం నుంచి అయ్యప్ప దీక్ష మాల ధార చేసిన స్వాములు గురువారం ఆంజనేయులు గురుస్వామి ఆధ్వర్యంలో 15మంది అయ్యప్పస్వాములు ఇరుముడి ప్రత్యేక పూజలు నిర్వహించి శబరిమల దర్శనం కోసం బయలుదేరారు. సుధాకర్ గురుస్వామి, కన్నయ్య గురుస్వామి, కరుణాకర్‌రెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పటాన్‌చెరులో..

అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో నిర్వహించిన అయ్యప్పస్వామి మహా పడిపూజలో గురువారం మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట కౌన్సిలర్ కాలప్ప, ఉపేందర్‌రెడ్డి, కృష్ణ, బిజిలి రాజు, యూసుఫ్, నవనీత పాల్గొన్నారు.

మంత్రులకు శుభాకాంక్షల వెల్లువ



దామోదర రాజనర్సింహకు అభినందనలు తెలుపుతున్న నాయకులు



భట్టి విక్రమార్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



మునిపల్లిలో మంత్రి దామోదరకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

జోగిపేట(అందోల్): వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా నియమితులైన దామోదర రాజనర్సింహను నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గురువారం సచివాలయంలో కలిసి ఘనంగా సన్మానించారు. మంత్రిని కలిసిన వారిలో జోగిపేట కౌన్సిలర్లు ఆకుల చిట్టిబాబు, సురేందర్‌గౌడ్, కృష్ణారెడ్డి, రంగ సురేష్, రేఖాప్రవీణ్, డాకూరి శివశంకర్, హరికృష్ణాగౌడ్, నాగరాజు, దుర్గేష్, చందర్, నాయకులు సంగమేశ్వర్, శివరాజ్, వెంకటేశం, గజ్జాడ కిషన్, రమేష్‌జ్యోషి, రాంరెడ్డి, శ్రీకాంత్, మాణిక్యంగౌడ్, మన్నె నరేందర్, రాజశేఖర్, రాజిరెడ్డి ఉన్నారు.

మునిపల్లిలో..

మునిపల్లి(అందోల్): వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పెద్దగోపులారం ఎంపీటీసీల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బుర్కల పాండు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీల ఆధ్వర్యంలో..

మాజీ ఎంపీపీ తాటిపల్లి రాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ అసత్‌పటేల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు గురువారం హైదరాబాద్‌లో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ నాయకులు మక్సూద్ పటేల్ పాల్గొన్నారు.

నారాయణఖేడ్: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వైద్య, ఆరోగ్యశాఖ, పౌరసరఫరాల శాఖల మంత్రులు దామోదర రాజనర్సింహా, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని అసెంబ్లీ ఆవరణలో గురువారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమతమ శాఖల ద్వారా ఖేడ్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఝరాసంగం(జహీరాబాద్): వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని ఎస్ఐ కృష్ణగౌడ్ అన్నారు. ఝరాసంగం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల గుర్తింపు పత్రాలు పరిశీలించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించనివారికి జరిమానా విధించారు.

రూ.9వేల కోట్ల ఖర్చుపై వివరాలు ఇవ్వండి

కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేసిన కాంగ్రెస్ నాయకులు



వినతిపత్రం అందజేస్తున్న ఐఎన్‌టీయూసీ, కాంగ్రెస్ నాయకులు

పటాన్‌చెరు టౌన్: బీఆర్ఎస్ హయాంలో 9ఏళ్ల పాలనలో రూ.9 వేల కోట్ల ఖర్చుతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని పటాన్‌చెరు ఎమ్మెల్యే బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడడం ఆశ్చర్యానికి గురిచేసిందని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. 9 ఏళ్లలో రూ.9వేల కోట్ల ఖర్చుపై పూర్తి వివరాలు ఇవ్వాలని కోరుతూ గురువారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో వేలాది మందికి గృహాలు, తదితర సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇన్ని వేల కోట్ల రూపాయల నిధులు వస్తే నియోజకవర్గంలో ఇళ్లు లేని పేదలు ఎలా ఉంటారని ప్రశ్నించారు. పారిశ్రామికవాడల్లో కనీస వసతులు లేక పేదలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పూర్తి వివరాలు ఇవ్వాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు. వినతిపత్రం అందజేసినవారిలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు పాషా, కిషన్, జైప్రకాష్, శ్రీనివాస్ ఉన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కుమార్‌యాదవ్

పటాన్‌చెరు టౌన్: సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని గౌతంనగర్ కాలనీలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను గురువారం పరిశీలించారు. అనంతరం అంబేడ్కర్ కాలనీలో పర్యటించి డ్రైనేజీ వ్యవస్థ, తాగునీరు, తదితర సమస్యలను కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు.

జాతర నిర్వహణపై సమావేశం

వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించనున్న మల్లన్న స్వామి జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయనున్నట్లు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. పటాన్‌చెరు పట్టణ పరిధిలోని పారిశ్రామికవాడలోని మల్లన్న దేవస్థానం వద్ద ఆలయ కమిటీ సభ్యులతో కలిసి గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి జాతరను వచ్చే నెల జనవరి 6, 7వ తేదీల్లో నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీపీ యాదగిరి, కృష్ణయాదవ్, మల్లేష్ యాదవ్, గోపాల్, సత్యనారాయణ, ఆలయ పండితులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్ ఎంపీపీపై అవిశ్వాసం

డీపీఓకు నోటీసులు అందజేసిన ఎంపీటీసీలు



డీపీఓకు అవిశ్వాస పత్రాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ ఎంపీటీసీలు

నారాయణఖేడ్: మండల పరిషత్తు అధ్యక్షురాలు చాందీబాయి చౌహాన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ బీఆర్ఎస్‌కు చెందిన ఎంపీటీసీలు గురువారం ఖేడ్ ఆర్డీఓ కార్యాలయ డీఏవో రత్నంకు నోటీసు అందజేశారు. మండల పరిషత్తు పరిధిలో 18మంది ఎంపీటీసీలు ఉండగా అందులో 14మంది బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందగా, కాంగ్రెస్ తరఫున ముగ్గురు, స్వతంత్ర అభ్యర్థిగా ఒకరు గెలుపొందారు. దీంతో అప్పట్లో బీఆర్ఎస్ నుంచి ర్యాకల్ ఎంపీటీసీగా గెలుపొందిన చాందీబాయి చౌహాన్‌ను ఎంపీపీగా నిజాంపేట్-2 ఎంపీటీసీ సాయిరెడ్డిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఇటీవల ఎంపీపీ చాందీబాయి చౌహాన్‌తో పాటు ర్యాలమడుగు స్వతంత్ర ఎంపీటీసీ మోతీబాయి, సత్తెగామ ఎంపీటీసీ సరోజనలు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో 12మంది బీఆర్ఎస్ ఎంపీటీసీల సంతకాలతో ఆర్డీఓ కార్యాలయ డీఏవో రత్నంకు అవిశ్వాసం నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌కు చెందిన ఎంపీటీసీలు మాట్లాడుతూ తమ పార్టీ ద్వారా ఎంపీటీసీగా గెలుపొందిన చాందీబాయిచౌహాన్ తమకు సమాచారం ఇవ్వకుండా కాంగ్రెస్‌లో చేరారని, అందువల్ల తాము ఆమెపై అవిశ్వాసాన్ని ప్రకటిస్తున్నామన్నారు. 18మంది సభ్యుల్లో అవిశ్వాసం నోటీసు ఇచ్చేందుకు 12మంది సభ్యులు అవసరం కాగా తాము 12మంది ఉన్నందునా అవిశ్వాసం నోటీసు అందజేశామని తెలిపారు. అవిశ్వాసం నోటీసులో తుర్కాపల్లి ఎంపీటీసీ అశోక్‌రెడ్డి, జగన్నాథ్‌పూర్ ఎంపీటీసీ రుక్మిణిబాయి, నమ్లిమేట్ ఎంపీటీసీ శ్రీనివాస్, సంజీవన్‌రావుపేట్ ఎంపీటీసీ భూపాల్, అనంతసాగర్ ఎంపీటీసీ రాజు, లింగాపూర్ ఎంపీటీసీ లక్ష్మి, చాప్టా(కె) ఎంపీటీసీ సునీత, కొండాపూర్ ఎంపీటీసీ సుజాత, అబ్బెంద ఎంపీటీసీ జగదేవి, వెంకటాపూర్ ఎంపీటీసీ చాంగీబాయి, వైస్ ఎంపీపీ సాయిరెడ్డి పేర్లు ఉన్నాయి. అవిశ్వాసం నోటీసు ఇచ్చిన వారి వెంట కోఆప్షన్ సభ్యులు నవాబ్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు రాజు, మాజీ సభ్యులు రవీందర్ నాయక్ ఉన్నారు. ఈ విషయంపై ఎంపీపీ చాందీబాయిచౌహాన్ స్పందిస్తూ అవిశ్వాసం నోటీసు ఇచ్చినవారిలో ఎంపీటీసీలు లేరని, నిబంధనల ప్రకారం ఆర్డీఓ ముందు అవిశ్వాసం ప్రవేశపెట్టే ఎంపీటీసీలు సంతకాలు చేయాల్సి ఉందన్నారు. అయినప్పటికీ బీఆర్ఎస్ వారు కొందరి సంతకాలు ఫోర్జరీ చేసి అవిశ్వాసం నోటీసు ఇచ్చారని, ఈ నోటీసు చెల్లదని ఆమె పేర్కొన్నారు.